సాక్షి
పశ్చిమగోదావరి
శనివారం ၊ 11 ၊ ఫిబ్రవరి ၊ 2023



శ్రీవారి ట్రస్టుకు విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు భీమవరానికి చెందిన కొటికలపూడి గోవిందరావు శుక్రవారం రూ.1,11,111 విరాళంగా అందజేశారు.



ఘనంగా గ్రామోత్సవం

పెనుగొండ: ఆచంట కచేరీ సెంటర్‌లో దాసాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామోత్సవం కనుల పండువగా నిర్వహించారు.



వేడుకగా చాత్మార్ ఉత్సవం

ద్వారకాతిరుమల: చినవెంకన్నకు శుక్రవారం రాత్రి చాత్మార్ ఉత్సవాన్ని నిర్వ హించారు. చత్మార్ తిరునక్షత్రాన్ని పురస్కరించుకుని ఈ వేడుకను జరిపారు.

న్యూస్‌రీల్

మళ్లీ జగనన్న ప్రభుత్వమే రావాలి



తణుకులో దివ్యాంగుడు అప్పారావును అభినందిస్తున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: 2024 ఎన్నికల్లో మళ్లీ జగనన్న ప్రభుత్వమే విజయం సాధించాలనే లక్ష్యంతో బైక్ యాత్ర చేస్తున్నానని విజయనగరం జిల్లాకు చెందిన దివ్యాంగుడు మాడెం అప్పారావు పేర్కొన్నారు. విజయనగరం జిల్లా కళ్లేపల్లి గ్రామానికి చెందిన అప్పారావు ఈనెల 4న ఇచ్ఛాపురం నుంచి విజయవాడకు బైక్ యాత్ర ప్రారంభించారు. శుక్రవారం తణుకు మంత్రి క్యాంపు కార్యాలయానికి వచ్చి పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరిని కలిశారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ మంచి సంకల్పంతో ప్రారంభించిన బైక్ యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ ఆర్థికసాయం అందచేశారు. కార్యక్రమంలో కె.ఇల్లింద్రపర్రు సొసైటీ అధ్యక్షులు మల్లిరెడ్డి నాగార్జున, వైఎస్సార్‌సీపీ పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, రాష్ట్ర చేనేత కార్పొరేషన్ మాజీ చైర్మన్ వావిలాల సరళాదేవి పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు సిద్ధం చేసుకోవాలి

సాక్షి, భీమవరం: నేషనల్ మీన్స్-కం-మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్) పరీక్షకు హాజరైన విద్యార్థులు ఈనెల 20 లోపుగా కుల, ఆదాయం, 7వ తరగతి మార్కుల ధ్రువీకరణ పత్రాలు సిద్ధం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు సర్టిఫికెట్ల విషయంలో వారి తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అధికారులు అడిగిన వెంటనే హాల్ టికెట్ జిరాక్స్‌తో సహా అన్ని పత్రాలు అందజేయాల్సి ఉంటుందని ప్రకటనలో పేర్కొన్నారు.

విధిగా తనిఖీలు నిర్వహించాలి



అధికారులతో మాట్లాడుతున్న జేసీ మురళి

భీమవరం (ప్రకాశం చౌక్): చౌక ధరల దుకాణాలు, పెట్రోల్ బంకులను తరచూ తనిఖీ చేయాలని జాయింట్ కలెక్టర్ జేవీ మురళి పౌర సరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. భీమవరం కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ జేవీ మురళి పౌర సరఫరాల శాఖ అధికారులతో శుక్రవారం సమావేశమై పలు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ షాపులను తనిఖీ చేసి స్టాకు నిల్వల రికార్డులను పరిశీలించాలన్నారు. స్టాక్ లో వ్యత్యాసాలుంటే చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి ఎస్.సరోజ, సహాయ పౌర సరఫరాల అధికారులు పాల్గొన్నారు.

తీరానికి కొట్టుకొచ్చిన భారీ తాబేలు



తీరానికి కొట్టుకొచ్చిన తాబేలు

మొగల్తూరు: కేపీ పాలెం సముద్ర తీరానికి భారీ తాబేలు కొట్టుకొచ్చింది. శుక్రవారం స్థానికులు సుమారు 50 కేజీల బరువుతో తాబేలు ఉబ్బిపోయి మృతి చెంది ఉండడాన్ని గుర్తించారు. సముద్రంలో భారీ పడవలు ఢీకొనడంతో మృతి చెంది ఉంటుందని భావిస్తున్నారు.

కుక్కునూరులో కేంద్ర బృందం సర్వే




కుక్కునూరు పీహెచ్‌సీ పరిధిలో సర్వే చేస్తున్న పాన్‌ఇండియా సర్వే బృందం

కుక్కునూరు: వరద ప్రభావిత ప్రాంతాలలో కౌమరదశలో ఉన్న బాలికలు తమ ఆరోగ్యం పట్ల ఏ మేరకు అవగాహన కలిగి ఉన్నారన్న విషయమై పాన్ ఇండియా స్టడీ కేంద్ర సర్వే బృందం శుక్రవారం కుక్కునూరు పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాలలో సర్వే నిర్వహించారు. బాలికలు రుతక్రమ సమయంలో శానిటరీ నాప్కిన్‌లను వినియోగిస్తున్నారా? లేక బట్టను వాడుతున్నారా? అనే విషయమై అడిగి తెలుసుకున్నారు. గత రెండు రోజులుగా ఈ బృందం సర్వే నిర్వహిస్తుంది.

నాయీ బ్రాహ్మణులకు సముచిత గౌరవం

- ఆలయాల బోర్డుల్లో స్థానం కల్పించడంపై హర్షం
- జీసీలకిచ్చిన మరో హామీ నిలబెట్టుకున్న వైఎస్ జగన్





ఏలూరు (టూటౌన్): గత పాలకులు నాయీ బ్రాహ్మణుల పట్ల నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించగా.. ప్రస్తుత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వారికి సముచిత గౌరవం కల్పించింది. ఆలయాల బోర్డుల్లో నాయీ బ్రాహ్మణులకు స్థానం కల్పిస్తూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ విడుదల చేయడంపై ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా నాయీ బ్రాహ్మణ సంఘాల నేతలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఆలయాల బోర్డుల్లో నాయీ బ్రాహ్మణులకు స్థానం కల్పించాలని ఎంతో కాలంగా కోరుతున్నారు. నాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును నాయీబ్రాహ్మణ సంఘాల పెద్దలు కలిసిన సమయంలో వారిని అవమానించారు. వారిని దూషించడంతో పాటు మీ తోకలు కత్తిరిస్తా, దేవాలయాల మెట్లు ఎక్కకుండా చేస్తా అంటూ హెచ్చరించిన విషయం తెలిసిందే. అనంతరం ఎన్నికల ముందు ఏలూరులో నిర్వహించిన వైఎస్సార్‌సీపీ బీసీ గర్జనలో నాయీ బ్రాహ్మణుల న్యాయమైన కోర్కెను తీరుస్తామని ఆనాడు ఇచ్చిన హామీని నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నెరవేర్చారు. దీంతో నాయీ బ్రాహ్మణులు సంబరాలు చేసుకుంటున్నారు. సీఎంకు రుణపడి ఉంటామని చెబుతున్నారు.

దేశ చరిత్రలోనే అరుదైన గౌరవం

నాయీ బ్రాహ్మణులకు దేశ చరిత్రలోనే అరుదైన గౌరవం దక్కిందంటూ వివిధ సంఘాల నాయకులు చెబుతున్నారు. తమ వినతిని ఆలకించిన రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో ఈ అవకాశం దక్కిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా సుమారు వంద దేవాలయాల్లో ట్రస్టు బోర్డు కమిటీలలో నాయీ బ్రాహ్మణులకు అవకాశం దక్కనుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ.25 లక్షలు పైగా ఆదాయం వచ్చే దేవాలయాలు 20 వరకూ ఉన్నాయి. వీటితో బాటు రూ.2 లక్షలు ఆదాయానికి పైగా వచ్చే దేవాలయాలు 400 వరకూ ఉన్నాయి. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు రూ.5 లక్షలు ఆదాయం పైగా వచ్చే ఆలయాల బోర్డు కమిటీల్లో నాయీ బ్రాహ్మణులకు ప్రాధాన్యత కల్పించనున్నారు.

సీఎంకు రుణపడి ఉంటాం



ఎన్నో ఏళ్లుగా దేవస్థానాల్లో సేవలందిస్తున్న నాయీ బ్రాహ్మణులకు అరుదైన గౌరవం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి రాష్ట్రంలోని యావత్ నాయీబ్రాహ్మణ సంఘీయులు రుణపడి ఉంటారు. గత పాలకులు మమ్మల్ని అవమానాలకు గురిచేస్తే.. దానికి భిన్నంగా నేటి పాలకులు సరైన గుర్తింపు ఇవ్వడం సంతోషంగా ఉంది.

– కింజింగి రాజు, రాష్ట్ర కార్యదర్శి, నాయీబ్రాహ్మణ సేవా సంఘం

నేడు సముచిత స్థానం



రాష్ట్ర వ్యాప్తంగా నాయీబ్రాహ్మణులకు గత ప్రభుత్వంలో అవమానం జరగగా.. నేడు వైఎస్ జగన్ పాలనలో సముచిత స్థానం కల్పించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి నాయీబ్రాహ్మణుల తరఫున ధన్యవాదాలు. ఎన్నికలకు ముందు ఏలూరులో జరిగిన వైఎస్సార్‌సీపీ బీసీ గర్జనలో నాయీబ్రాహ్మణులకు ఇచ్చిన హామీని నెరవేర్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

– పరిటాల వీరాస్వామి, నాయీబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు, ఏలూరు

దేశ చరిత్రలోనే అరుదు



నాయీ బ్రాహ్మణులకు ఆలయాల ట్రస్టు బోర్డులో సభ్యత్వం కల్పించడం దేశ చరిత్రలోనే అరుదైన విషయం. ఇంతటి మహోపకారాన్ని చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు నాయీబ్రాహ్మణులు పక్షాన కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. ఆలయాల బోర్డుల్లో చోటు కల్పిస్తూ దేవదాయ శాఖ చట్టానికి సవరణ తెచ్చి ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయడం గొప్ప విషయం.

– అరిసెపల్లి ప్రసాద్ నంద, సహాయ కార్యదర్శి, రాష్ట్ర నాయీబ్రాహ్మణ నంద యువసేన

సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు



నాయీబ్రాహ్మణులకు ఆలయ బోర్డుల్లో స్థానం కల్పిస్తూ ఆర్డినెన్స్ విడుదల చేయడం హర్షణీయం. నాయీ బ్రాహ్మణుల తరఫున ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్నకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. ఎవరూ ఇవ్వని గౌరవాన్ని కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు వచ్చే ఎన్నికల్లో నాయీబ్రాహ్మణులు అండగా ఉంటారు. మళ్ళీ ఆయనే ముఖ్యమంత్రి అయ్యేలా ప్రతీ ఒక్క బీసీ కృషి చేయాల్సిన అవసరం ఉంది.

– ఉద్దవల్లి కిషోర్, ప్రచార కార్యదర్శి, నాయీబ్రాహ్మణ సేవా సంఘం, ఏలూరు టౌన్

నిడదవోలు రైల్వేగేటు పునఃప్రారంభం



రైల్వే గేటు వద్ద పూర్తయిన మరమ్మతులు

నిడదవోలు: నిడదవోలు పట్టణంలో నెహ్రూ బొమ్మ సెంటర్‌లోని రైల్వేగేటు వద్ద ట్రాక్ మరమ్మతు పనులు పూర్తయ్యాయి. శుక్రవారం సాయంత్రం 7.30 గంటలకు గేటును తిరిగి ప్రారంభించారు. రైల్వేగేటు వద్ద రైల్వే సెక్షన్ ఇంజనీర్ రావి రాజేష్, నిడదవోలు రైల్వే స్టేషన్ మేనేజర్ జి.సత్యనారాయణలు పూజలు చేసి గేటును పైకి ఎత్తారు. రైల్వే భద్రతా చర్యల్లో భాగంగా ట్రాక్ మరమ్మతుల కోసం రైల్వేగేటును గత నెల 30న ఉదయం 7 గంటలకు మూసివేశారు. పనులు పూర్తి కావడంతో గేటు ఎత్తి తిరిగి వాహనాల రాకపోకలను అనుమతించారు. రోజుకు 200 రైళ్ల పైగా రాకపోకలు సాగించే ఈ మార్గంలో ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకుని ట్రాక్ పటిష్టపరిచారు. తొలుత రైల్వే అధికారులు ఈనెల 8న గేటు తెరుస్తామని ప్రకటించారు. పనులు ఆలస్యం కావడంతో రెండు రోజులు గడువు పెంచారు.

సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు

సాక్షి, భీమవరం: ప్రభుత్వం ప్రకటించిన సెలవు రోజుల్లో ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలలో తరగతులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తే పాఠశాల గుర్తింపు రద్దుచేస్తామని తరగతు నిర్వహణ కూడా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మాత్రమేనని వాటిని తప్పక పాటించాలని పేర్కొన్నారు. నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు.

మహా ప్రసాదం



సిరుల తల్లి.. కల్పవల్లి.. భీమవరం మావుళ్లమ్మవారి ఆలయ వార్షికోత్సవాలముగింపు సందర్భంగా శుక్రవారం ఆలయంలో మహా నివేదన (మహా ప్రసాదం) సమర్పించారు. ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం జరిగిన అఖండ అన్నసమారాధనకు సుమారు 70 వేల మందికి పైగా భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ భక్తులు అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. 29 రోజులపాటు అమ్మవారి ఉత్సవాలు నేత్రపర్వంగా జరిగాయి. – భీమవరం (ప్రకాశం చౌక్)

ఇంటర్ పరీక్షలు సజావుగా నిర్వహించాలి



హాజరైన వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు సజావుగా నిర్వహించాలని, ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కే.చంద్రశేఖర బాబు సూచించారు. శుక్రవారం స్థానిక సెయింట్ థెరిస్సా జూనియర్ కళాశాలలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని అన్ని యాజమాన్యాల్లోని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 15న జరిగే నైతిక, మానవ విలువలు పరీక్ష, ఈ నెల 17న జరిగే పర్యావరణ విద్య పరీక్ష రాసి అర్హత సాధించాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో 250 పరీక్షా కేంద్రాల్లో 34,123 మంది మొదటి సంవత్సరం విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉందని చెప్పారు. శిక్షణా కార్యక్రమంలో పరీక్షల కమిటీ సభ్యులు ఎస్.సత్యనారాయణ, కేవీ రామారావు, ఎం.పేర్రాజు తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రికి ప్రత్యేక బస్సు సర్వీసులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఈ నెల 17, 18, 19 తేదీల్లో జిల్లాలోని వివిధ శైవక్షేత్రాలకు ప్రత్యేకబస్సు సర్వీసులు నడపడానికి చర్యలు తీసుకున్నట్లు ఏలూరు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్ తెలిపారు. శుక్రవారం జిల్లా ప్రజా రవాణా శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ హిందువుల్లో శివరాత్రి పర్వదినానికి విశేష ప్రాముఖ్యత ఉందని, శివరాత్రి నాడు శైవక్షేత్రాలను దర్శించుకోవడం మహా పుణ్యకార్యంగా భావిస్తారన్నారు. భక్తుల సౌకర్యార్థం జిల్లాలోని పట్టిసం, బలివే, తాడువాయి శైవక్షేత్రాలకు భక్తులను తీసుకువెళ్ళడానికి 120 ప్రత్యేక బస్సులను సిద్ధం చేశామన్నారు. వీటిలో ఏలూరు డిపో నుంచి 35 బస్సులను బలివే క్షేత్రానికి కొత్త బస్టాండు నుంచి దుగ్గిరాల మీదుగా 5 బస్సులు, మిగిలిన 30 బస్సులు పాత బస్టాండు నుంచి ఫైర్‌స్టేషన్, ఖండ్రికగూడెం, చొదిమెళ్ళ మీదుగా తిరుగుతాయన్నారు. నూజివీడు నుంచి వయా ముసునూరు, గోపవరం మీదుగా బలివేకు 30 బస్సులు, జంగారెడ్డిగూడెం నుంచి కొయ్యలగూడెం, కన్నాపురం మీదుగా పట్టిసంకు 35 బస్సులు, జంగారెడ్డిగూడెం నుంచి అన్నదేవరపేట, చిట్యాల మీదుగా పట్టిసంకు 5 బస్సులు, జంగారెడ్డిగూడెం నుంచి తాడువాయికి 5 బస్సులు నడపడానికి సిద్ధం చేశామన్నారు. వీటితో పాటు శ్రీశైలం క్షేత్రానికి కూడా ప్రత్యేక సర్వీసులు అందుబాటులో ఉంచామన్నారు. భక్తుల సౌకర్యార్థం అన్ని బస్ స్టేషన్లలో సమాచార కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు.

శివరాత్రి ఉత్సవాలకు భారీ బందోబస్తు

కైకలూరు(కలిదిండి): ఏలూరు జిల్లాలో శైవక్షేత్రాల్లో జరిగే శివరాత్రి మహోత్సవాలకు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ చెప్పారు. కై కలూరు నియోజకవర్గం కలిదిండి పార్వతీ సమేత పాతాళ భోగేశ్వరస్వామి దేవాలయంలో ఈ నెల 17 నుంచి జరిగే శివరాత్రి మహోత్సవ ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు. ముందుగా స్వామిని ఎస్పీ దర్శించుకున్నారు. అనంతరం ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు, స్థానిక పోలీసు సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు.

కల్యాణమస్తులో రూ.1.10 కోట్ల సాయం

కలెక్టర్ పి.ప్రశాంతి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫాలో భాగంగా జిల్లాలో 145 మంది మహిళలకు రూ.1,10,65,000 ఖాతాల్లో జమ చేశామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. శుక్రవారం అమరావతి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కళ్యాణమస్తు, షాదీ తోఫా పంపిణీ కార్యక్రమాన్ని బటన్ నొక్కి ప్రారంభించారు. కార్యక్రమంలో కలెక్టర్ కార్యాలయం నుంచి పాల్గొన్న జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీలకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున, ఎస్సీలు కులాంతర వివాహం చేసుకుంటే ఒక్కొక్కరికి రూ.1.20 లక్షల చొప్పున, ఎస్టీలకు రూ.లక్ష చొప్పున, ఎస్టీలు కులాంతర వివాహం చేసుకున్న వారికి రూ.1.2 లక్షల చొప్పున, బీసీలకు రూ.50 వేల చొప్పున, బీసీ మహిళలు కులాంతర వివాహం చేసుకున్న వారికి ఒక్కొక్కరికి రూ.75 వేలు, మైనార్టీస్‌కి ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున ఒక్కరికి రూ.లక్ష, వికలాంగులకు ఒక్కొక్కరికి రూ.1.5 లక్షల చొప్పున, ఓసీలలో భవన నిర్మాణ కార్మికుల కార్డు ఉన్న వారికి ఒక్కొక్కరికి రూ.40 వేలు చొప్పున ఖాతాల్లో జమ చేశామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఈ కార్యక్రమం మొదటి విడత మంజూరు చేశామని, ప్రతి మూడు నెలలకు ఒకసారి వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా అందిస్తామని కలెక్టర్ తెలిపారు. వివాహాలు చేసుకున్న మహిళలు సంబంధిత గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకొని వైఎస్సార్ కళ్యాణమస్తు, షాది తోఫా పొందాలని కలెక్టర్ సూచించారు.

ఎన్నికల కోడ్ కచ్చితంగా పాటించాలి

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఎన్నికల నోడల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం భీమవరం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి ఎన్నికల నిర్వహణ సన్నద్ధతపై సబ్ కలెక్టర్ , ఆర్డీఓ, తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. గతంలో జిల్లాలో ఎన్నికల విజయవంతానికి ఏ విధంగా కృషి చేశారో అదే స్ఫూర్తితో ప్రస్తుతం ఎన్నికలను పకడ్బందీగా, నిష్పక్షపాతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు. నిర్దేశించిన తేదీల్లో ఎన్నికల నిర్వహణపై పోలింగ్ అధికారులకు శిక్షణ ఇవ్వాలన్నారు. ఎన్నికల విధులకు నియమించిన అధికారులందరూ తప్పకుండా శిక్షణకు హాజరు కావాలన్నారు. పోలింగ్ స్టేషన్లలో అవసరమైన అన్ని వసతులతో పాటు.. భద్రత ఏర్పాట్లను కూడా సంసిద్ధం చేసుకోవాలన్నారు. ఎన్నికల నియమావళిని తూచా తప్పక అందరూ పాటించాలన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలు అధికారులుగా మున్సిపల్ కమిషనర్లను, ఎంపీడీవోలను నియమిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి వీడియోగ్రాఫర్, సూక్ష్మ పరిశీలకులను నియమించాలన్నారు. ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితాలో పేర్లు, ఇంటి పేరు తప్పులు ఉంటే సరిచేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ రవిప్రకాష్ , జాయింట్ కలెక్టర్ జేవీ మురళీ, డీఆర్వో కె.కృష్ణవేణి, అదనపు ఎస్పీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆసరాగా అమ్మఒడి

అనాథ పిల్లలకు అమ్మఒడి ఆసరాగా ఉంటుందని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో కోవిడ్ వల్ల అనాథలుగా మారిన పిల్లలకు అమ్మఒడి చెక్కులు పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లిదండ్రులకు వారి పిల్లలు భారం కాకూడదని, కష్టంతో కాకుండా ఇష్టంతో చదివించాలనేదే ప్రభుత్వ ధ్యేయం అన్నారు. పిల్లలు బాగా చదువుకుని ఉన్నత విద్యను అభ్యసించడం ద్వారా మంచి స్థానంలో ఉండాలన్నారు. తల్లిదండ్రులు చనిపోవడం వల్ల వాళ్ల ఖాతాల్లో అమ్మ ఒడి జమ కాలేదని, పిల్లల తల్లి లేక తండ్రి లేక సంరక్షకులను గుర్తించి వారికి కూడా అమ్మఒడి జమయ్యేలా చర్యలు తీసుకున్నామన్నారు. 2021–22లో 200 మంది అనాథలు అమ్మ ఒడికి అర్హత పొందగా 122 మందికి ఇప్పటికే జమ అయ్యిందన్నారు. 8 మంది విద్యార్థుల వివరాలు తెలియాల్సి ఉందని చెప్పారు. తల్లిదండ్రులు ఇద్దరూ లేని పిల్లలకు సంరక్షకులు, పిల్లల పేరిట జాయింట్ అకౌంట్ ఏర్పాటు చేసి చెక్కును జమ చేస్తున్నామన్నారు.

శ్రీవారి దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యుడిగా ప్రమాణ స్వీకారం



శ్రీవారి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడు సంపత్‌కుమార్‌తో ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఆలయ ఈఓ త్రినాథరావు

ద్వారకాతిరుమల: చినవెంకన్న దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి సభ్యుడిగా తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురానికి చెందిన ముప్పిడి సంపత్‌కుమార్ శుక్రవారం ఉదయం ప్రమాణస్వీకారం చేశారు. శ్రీవారి ఆలయానికి 16 మంది సభ్యులతో కూడిన ట్రస్టుబోర్డును ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 6న రాత్రి జీఓను జారీ చేసింది. ఈ క్రమంలో 9న మండలి ప్రమాణ స్వీకార మహోత్సవం జరిగింది. కొన్ని అనివార్య కారణాలు వల్ల సంపత్‌కుమార్ ఈ కార్యక్రమానికి హాజరు కాలేదు. దాంతో మరుసటి రోజు ఉదయం ఆలయ కార్యాలయానికి విచ్చేసిన ఆయనతో దేవస్థానం ఈఓ ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం సంపత్‌కుమార్ దంపతులు, వారి వెంట ఉన్న వైఎస్సార్ సీపీ నాయకులు స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

'కోతులను చంపిన వారిని పట్టుకుంటాం'


కోతి కళేబరాన్ని పరీక్షిస్తున్న అధికారులు, డాక్టర్లు

మొగల్తూరు: జంతువులను చంపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఫారెస్ట్ రేంజ్ అధికారి ఎస్‌కే ఫిరోజ్ హెచ్చరించారు. కేపీపాలెం సముద్ర తీర ప్రాంతంలో మృతి చెందిన కోతులను శుక్రవారం ఆయన పరిశీలించారు. కోతులను వేరే ప్రాంతంలో చంపేసి ఇక్కడ పడివేసినట్లుగా అనుమానిస్తున్నామని, కేసు నమోదు చేశామని, నిందితులను త్వరలో పట్టుకుంటామని ఫిరోజ్ చెప్పారు. కోతుల గుంపులను గుర్తిస్తే వాటిని అడవిలో వదిలిపెడతామన్నారు. పశువైద్య శాఖ ఏడీఏ సుచరిత మాట్లాడుతూ సుమారు 26 కోతులు మృతి చెందగా, వీటి లక్షణాలన్నీ ఒకే రకంగా ఉండటంతో ఐదు కోతులకు పోస్టు మార్టం నిర్వహించామన్నారు. ఫోరెన్సిక్ ల్యాబ్ రిపోర్టును బట్టి కోతుల మృతికి గల కారణాలు తెలుస్తాయని చెప్పారు. కోతులను పూడ్చి పెట్టి నివాళులర్పించామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నీలిమ, డాక్టర్ సురేంద్ర, జిల్లా అటవీశాఖాధికారి త్రిమూర్తులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యానికి ఎస్‌పీఎల్ దోహదం

- సెబ్ అడిషినల్ ఎస్పీ రవికుమార్
- సత్తా చాటిన సీఆర్‌ఆర్ జట్లు

సాక్షి, భీమవరం: క్రీడా నైపుణ్యం సాధించేందుకు సాక్షి మీడియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ దోహద పడుతుందని భీమవరం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌బ్యూరో (సెబ్) అడిషినల్ ఎస్పీ ఏటీవీ రవికుమార్ అన్నారు. భీమవరం డీఎన్నార్ కళాశాలలోని గన్నాబత్తులవారి క్రీడామైదానంలో వారం రోజుల పాటు నిర్వహించిన సాక్షి

ప్రీమియంలీగ్ (ఎస్‌పీఎల్) జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ముగింపు సందర్భంగా శుక్రవారం బహుమతి ప్రదానోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో సెబ్ అడిషినల్ ఎస్పీ మాట్లాడుతూ క్రీడలు శరీరదారుఢ్యంతో పాటు ఉపాధి అవకాశాలకు దోహదం చేస్తాయని అన్నారు. నాలుగేళ్లుగా సాక్షి క్రికెట్ పోటీలు నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. భీమవరం డీఎస్పీ బండారు శ్రీనాథ్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని, క్రీడలతో ఐక్యత ఏర్పడుతుందని అన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు) మాట్లాడుతూ క్రీడల్లో రాణించడం ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని చెప్పారు. అనంతరం విజేత జట్లకు రవికుమార్, శ్రీనాథ్, బాబు చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సాక్షి తాడేపల్లిగూడెం యూనిట్ మేనేజర్ వెంకటశివుడు, డీఎన్నార్, విష్ణు కళాశాలల పీడీలు నర్సింహరాజు, శ్రీనివాసరావు, క్రికెట్ పోటీల రిఫరీలు పార్థసారధి, చైతన్య, రవితేజ, చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.


సీనియర్స్ విభాగం విన్నర్స్ సీఆర్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాల జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న ఏఎస్పీ రవికుమార్, డీఎస్పీ శ్రీనాథ్, గాదిరాజు బాబు


జూనియర్స్ విన్నర్స్ సీఆర్‌ఆర్ పాలిటెక్నిక్ జట్టుకు ట్రోఫీ అందజేత


సీనియర్స్ రన్నర్స్ భీమవరం విష్ణు కాలేజీ జట్టు


జూనియర్స్ రన్నర్స్ సీఆర్‌ఆర్ జూనియర్ కళాశాల జట్టు

హోరాహోరీగా ఎస్‌పీఎల్ ఫైనల్స్

సాక్షి ప్రీమియర్ లీగ్ ఫైనల్స్ హోరాహోరీగా సాగాయి. వారం రోజులుగా అలరించిన క్రికెట్ మ్యాచ్ టోర్నమెంట్లలో 26 జట్లు పోటీపడ్డాయి. గ్రూప్ దశలో సత్తా చాటి సీనియర్స్ విభాగంలో ఏలూరు సర్ సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల, భీమవరం విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ జట్లు, జూనియర్ విభాగంలో ఏలూరు సర్ సీఆర్ రెడ్డి పాలిటెక్నిక్, సర్ సీఆర్ రెడ్డి జూనియర్ కళాశాల జట్లు ఫైనల్స్‌కు చేరాయి.

జూనియర్స్ విజేత సీఆర్‌ఆర్ పాలిటెక్నిక్ జట్టు

జూనియర్స్ విభాగంలో టాస్ గెలిచిన సర్ సీఆర్ రెడ్డి జూనియర్ కళాశాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 47 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన ఏలూరు సర్ సీఆర్ రెడ్డి పాలిటెక్నిక్ జట్టు 4.4 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి లక్ష్యాన్ని చేధించి జూనియర్స్ విభాగంలో ట్రోఫీ అందుకుంది.

సీనియర్స్ విజేత సీఆర్‌ఆర్ ఇంజినీరింగ్ జట్టు

సీనియర్స్ విభాగంలో టాస్ గెలిచి బ్యాటింగ్‌కు వచ్చిన సర్ సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 82 పరుగులు చేసింది. అనంతరం 83 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన భీమవరం విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ జట్టును పదునైన బౌలింగ్‌తో కట్టడి చేసింది. వికెట్లు తీస్తూ ప్రత్యర్థి బ్యాటర్లపై సీఆర్ రెడ్డి జట్టు ఒత్తిడి పెంచింది. 8 ఓవర్లలో 8 వికెట్లు తీసి 34 పరుగుల తేడాతో ఏలూరు సర్ సీఆర్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల జట్టు సాక్షి ప్రీమియర్ విజేతగా నిలిచింది.

వైభవంగా దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠ

అత్తిలి: స్థానిక ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. నూతనంగా నిర్మించిన ఉపాలయాల్లో లలితా పరమేశ్వరిదేవి, విఘ్నేశ్వరస్వామి, సరస్వతీదేవి, ఆంజనేయ స్వామివార్ల విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఉదయం మండపారాధన, హోమ పూజలు, మహా పూర్ణాహుతి అనంతరం విగ్రహ ప్రతిష్ఠాపన చేసారు. ఆలయ అర్చకులు నాభీమశంకరశర్మ ఆధ్వర్యంలో వేదపండితుల సమక్షంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొని, స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ తరపున మంత్రి కారుమూరి నాగేశ్వరరావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దుడే ఉమామహేశ్వరరావు, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, కంకటాల సతీష్, గారపాటి నాగరాజు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు బుద్దన లక్ష్మీప్రభాకర జ్యోతి, అనంతపల్లి రాజరాజేశ్వరి, దుడే సీతారత్నం, కొనగళ్ల రాధా, భక్తులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో పూజలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ముత్యాలంబపురం ముత్యాలమ్మ వారి ఆలయ నాల్గవ వార్షికోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. వార్షికోత్సవం, శుక్రవారం కావడంతో మహిళలు అమ్మవారిని దర్శించారు. సాయంత్రం లలిత సహస్రనామ పారాయణ, గీతాపారాయణ నిర్వహించారు. అమ్మవారి వెండి చీర నిమిత్తం తాడేపల్లిగూడెం సత్యవతినగర్‌కు చెందిన నాగేంద్రకుమార్, సత్యవతి దంపతులు రూ.25వేలు విరాళం అందజేశారు. ఉంగుటూరు మండలం బొమ్మిడికి చెందిన గిద్దా సుబ్బారావు దంపతులు మరో రూ.10వేలు విరాళం అందజేశారు.


అత్తిలిలో విశేష అలంకరణలో ముత్యాలమ్మవారు


అత్తిలిలో ఆంజనేయస్వామి ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠ పూజల్లో పాల్గొన్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు


బలుసులమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


ముత్యాలమ్మ ఆలయ ప్రాంగణంలో కుంకుమ పూజలు నిర్వహిస్తున్న మహిళలు

ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మాకా బాలాజీ, ఆలయ కార్యనిర్వహణాధికారి పి.హరేరాంప్రసాద్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం

అత్తిలి: బల్లిపాడు రోడ్డులోని ముత్యాలమ్మవారి ఆలయం 8వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో, దాతల సహకారంతో అఖండ అన్నసమారాధన నిర్వహించారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అక్కడ జరుగుతున్న అన్నసమారాధనలో మంత్రి పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బలుసులమ్మ ఆలయంలో పూజలు

తాడేపల్లిగూడెం: పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ ఆలయంలో శుక్రవారం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మునిసిపల్ అసిస్టెంటు ఇంజనీర్ దత్తగుంటల హర్షగౌతమ్ కుటుంబ సభ్యులు సహకరించారు. దాతలు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రసన్నాంజనేయస్వామికి పూజలు


కుంచనపల్లి ద్వారకానగర్‌లోని ప్రసన్నాంజనేయస్వామికి పూజలు

తాడేపల్లిగూడెం రూరల్: కుంచనపల్లి ద్వారకానగర్‌లోని ప్రసన్నాంజనేయ స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఏడాది పూర్తయిన సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఇదే ప్రాంతంలో శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించాలని నిర్ణయించామన్నారు. ఆలయ నిర్మాణానికి భక్తులు తమవంతు సహాయ, సహకారాలు అందించాలని కోరారు. ఈ నెల 11న ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహం వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

కార్పెంటర్ల క్యాలెండర్ ఆవిష్కరణ


తణుకులో కార్పెంటర్ల సంఘ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: చేతి వృత్తుల పనివార్లకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఆయన కార్యాలయం వద్ద రాష్ట్ర కార్పెంటర్ సంఘ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంపటాపు శ్రీమన్నారాయణ, వర్కింగ్ సెక్రటరీ గోడి నాగబాబు, తణుకు పట్టణ సంఘ అధ్యక్షుడు కలగర్ల శేషగిరిబాబు, ప్రధాన కార్యదర్శి కొప్పోజు కొండబాబు, కోశాధికారి చిక్కాల సూర్యనారాయణ, పల్లెంజల నాగభూషణం పాల్గొన్నారు.

న్యాయవాదిపై దాడికి నిరసన


తణుకులో నిరసన తెలుపుతున్న బార్ అసోసియేషన్ న్యాయవాదులు

తణుకు అర్బన్: నంద్యాల జిల్లా డోన్ బార్ అసోసియేషన్ న్యాయవాది పులి దామోదర్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ తణుకు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. తక్షణమే దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వెన్నపు సుధాకర్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కౌరు వెంకటేశ్వర్లు, కామన మునిస్వామి, గొల్లపల్లి అంబేద్కర్, నందూరి రామానుజం, నక్కా అజయ్ కుమార్, పి.గంగాధర్, ఆర్వీ సురేష్‌బాబు, చోడే గోపాలకృష్ణ పాల్గొన్నారు.

శాశ్వత భూహక్కు పథకంతో సమస్యల పరిష్కారం

పెంటపాడు: జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకం భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి ఎంతో ఉపయోగపడుతుందని వైఎస్సార్ బీసీ సంఘ నాయకులు చింతపల్లి శ్రీనివాస్, కొండేపాడు సర్పంచ్ కట్టా దానయ్య పేర్కొన్నారు. జగనన్న భూహక్కు– భూరక్ష పథకంలో భాగంగా మీనవిల్లూరు నుంచి రామచంద్రపురం, కొండేపాడులో రీ సర్వే చేసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన డ్రోన్ వినియోగాన్ని శుక్రవారం ప్రారంభించారు. చేనేత వీవర్స్ సొసైటీ మాజీ అధ్యక్షుడు చల్లా లింగమూర్తి, మండల సర్వేయర్ జ్యోతి, కోరిమిల్లి సొసైటీ త్రిసభ్య కమిటీ సభ్యుడు దేవరశెట్టి రాంబాబు, రామచంద్రపురం మాజీ సర్పంచ్ చల్లా కుమారస్వామి మీనవిల్లూరు వీఆర్వో చిలకా శ్రీనివాసరావు, వీఆర్వోలు, డ్రోన్ సిబ్బంది పాల్గొన్నారు.

వినియోగదారులకు ఎల్ఐసీ ద్వారా నాణ్యమైన సేవలు

తణుకు అర్బన్: ఎల్ఐసీ 66 ఏళ్లగా క్లెయిమ్‌ల పరిష్కారంలో, వినియోగదారులకు నాణ్యమైన సేవలందించడంలో ఎల్ఐసీ అగ్రగామిగా నిలిచినట్లు రాజమండ్రి డివిజన్ సీనియర్ డివిజినల్ మేనేజరు బి.ప్రసాదరావు అన్నారు. తణుకు ఎల్ఐసీ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా క్లయిమ్స్ సెటిల్‌మెంట్లలో 99 శాతంతో ప్రపంచంలోని బీమా సంస్థలన్నింటిలోనూ అగ్రభాగాన నిలిచినట్లు స్పష్టం చేశారు. పాలసీల్లో అత్యధిక రాబడినిచ్చే ధన్ వర్ష్ పాలసీ మార్చి 21వ తేదీతో ముగుస్తుందని, ప్రజలు విరివిగా తీసుకుని లబ్ది పొందాలని సూచించారు. ముందుగా తణుకు ఎల్ఐసీ కార్యాలయం నుంచి రాష్ట్రపతి రోడ్డు మీదుగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం అధినేతకు ఆహ్వానం అనే కాంపిటీషన్‌లో విజేతగా నిలిచిన మేడేపల్లి స్వాతిలక్ష్మి ఏజెంట్‌ను, డీవో ఎం.లక్ష్మణ్‌ను ఘనంగా సత్కరించారు. తణుకు ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజరు బి.స్వామి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎల్ఐసీ ఉద్యోగులు, ఏజెంట్లు పాల్గొన్నారు.

మానవత- నైతికతపై రాష్ట్ర వ్యాప్త ఉద్యమం

తణుకు టౌన్: ఈనెల 11 నుంచి 20వ తేదీ వరకూ జమాతే ఇస్లామీ హింద్ సంస్థ ఆధ్వర్యంలో మానవత-నైతికత అనే అంశంపై రాష్ట్ర వ్యాప్త ఉద్యమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ జిల్లా ఆర్గనైజర్ అబ్దుల్ కరీమ్ ముజాహిద్ చెప్పారు. శుక్రవారం తణుకులోని రంగంతోటలో గల ఆయేషా ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ కార్యక్రమంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తణుకు శాఖ అధ్యక్షుడు అబ్దుల్ వహాబ్ అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా మానవత-నైతికత అనే ఉద్యమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జమాతే ఇస్లామీ హింద్ సభ్యులు కమాలుద్దీన్, అబ్దుల్ రెహ్మాన్, నజీముద్దీన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ

తణుకు టౌన్: ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యోగం ఎక్కడ వచ్చినా చేరి విధులను సక్రమంగా నిర్వహించేందుకు సంసిద్ధంగా ఉండాలని సిడాప్ జేడీ ఎం పార్థసారధి చెప్పారు. శుక్రవారం తణుకులోని శ్రీ చిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర స్కిల్ డవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాను అయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న స్కిల్ డవలప్‌మెంట్ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ యువత సమయాన్ని వృథా చేయకుండా వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో 9 కంపెనీలు పాల్గొనగా జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన 471 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వారిలో 118 ఉద్యోగాలకు ఎంపికయ్యారని నిర్వాహకులు తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ ఏడుకొండలు, జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి జీ ప్రవీణ్ పాల్గొన్నారు.



మెగా జాబ్ మేళాను ఉద్దేశించి మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరరావు

పీడీఎస్‌యూ జిల్లా కార్యవర్గ సమావేశం

తణుకు: సామాజిక స్పృహతో విద్యార్థులు పోరాట వారసత్వాన్ని అలవర్చుకోవాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కోశాధికారి యు.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.వినోద్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఫాసిస్టు మతోన్మాదం దేశాభివృద్ధికి తీవ్ర ఆటంకంగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కాకి నాని, కార్యదర్శిగా ఎస్.మహర్షి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఇ.భూషణం, ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకులు అయినపర్తి రాజగోపాల్, రామ్మోహన్ పాల్గొన్నారు.



తణుకులో జిల్లా సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర నాయకులు

అదానీ ఆస్తులు జప్తు చేయాలి

ఇరగవరం: బ్యాంకులను మోసగించి దేశాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టిన అదానీ ఆస్తులను ప్రభుత్వం జప్తు చేయాలని సీపీఐ ఇరగవరం మండల నాయకులు అన్నారు. శుక్రవారం తూర్పు విప్పర్రు యూనియన్ బ్యాంక్ వద్ద ధర్నా మండల నాయకులు నామాన వేంకటేశ్వరరావు మాట్లాడుతూ అదాని ఆస్తులు కోవిడ్ సమయంలో పెరిగిన విధానాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ఆర్థిక కుంభకోణానికి పాల్పడిన అదాని ఆస్తులు తక్షణం జప్తు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిద్దా సూర్య నారాయణ, కుడిపూడి వెంకటరెడ్డి, కాటూరి రాముడు, గుడిమెట్ల కోటేశ్వరరావు, అడపా సత్తిపండు, చిక్కాల ఉమా, కర్రి శ్రీనివాసు, గేదెల మునియ్య, దాసి రెడ్డి చిన్నా, షేక్ నజీర్, సిరగం సత్యం పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

తణుకు టౌన్: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఎం అరుణ కుమారి చెప్పారు. శుక్రవారం తణుకులోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, చట్టాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా కిషోర బాలికల ఆరోగ్యం, పౌష్టికాహారం వంటి అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పీఎస్‌వీకే పరమేశ్వరి, రమాదేవి, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణం ప్రారంభం

తాడేపల్లిగూడెం అర్బన్: తాడేపల్లిగూడెం నుంచి కుంచనపల్లి వెళ్లే మార్గంలో ద్వారకానగర్ ప్రాంతంలో వైష్ణవ సంప్రదాయ రీతిలో శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం చేపట్టినట్లు ఆత్కూరి కామేశ్వరరావు శుక్రవారం వెల్లడించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని ఉత్తరద్వార దర్శన ముఖంగా నిర్మిస్తున్నట్లు చెప్పారు. ద్వారకానగర్‌లో నిర్మించే ఆలయంలో నిత్యం ఉత్తర ద్వార దర్శనం చేసుకునే విధంగా నిర్మిస్తున్నామన్నార. దాతల సహకారంతో గజం రూ.7వేలు చొప్పున 534 గజాల స్థలాన్ని కొనుగోలు చేసి ఆలయ నిర్మాణం చేపట్టామన్నారు. ఆలయ నిర్మాణం పూర్తిస్థాయిలో దాతల సహకారంతోనే నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఆలయ ట్రస్ట్ సభ్యులుగా 13 మంది, నిర్వహణ కమిటీ సభ్యులుగా 12 మందిని నియమించినట్లు చెప్పారు. పట్టణానికి చెందిన ప్రముఖులు మల్లిని కనికిరెడ్డి రూ.5లక్షలు, దళక శ్రీనివాస్ 100 గజాల స్థలం, ఆత్కూరి కామేశ్వరరావు రూ. 1.07116 అందజేశారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు అప్పడా చైర్మన్ వడ్డే రఘురాం భవిష్యత్తులో ఆలయ నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తామన్నారు. ఆలయ నిర్మాణానికి విరాళాలు ఇచ్చే దాతలు 94900 41611, 91545 51333, 77173 96807, 92467 66656 ఫోను నంబర్లను సంప్రదించాలని తెలిపారు. స్వయంగా విరాళం అందించాలనే దాతలు ఆలయ ట్రస్ట్ పేరుతో ఏర్పాటుచేసిన యూనియన్ బ్యాంక్ ఖాతా నంబరు 129811010000013, ఐఎఫ్ఎస్‌సీ యూబీఐఎన్ 0812986 ఖాతాకు జమ చేయవచ్చని తెలిపారు. విరాలకు ట్రస్ట్ ఫోను నంబరు 7337435339కు సంప్రదించాలని తెలిపారు.

నేడు భారీ అన్నసమారాధన

శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణ సమీపంలో గతేడాది ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించినట్లు కామేశ్వరరావు తెలిపారు. వార్షికోత్సవం సందర్భంగా శనివారం భారీ అన్నసమారాధన నిర్వహిస్తున్నామన్నారు. కమిటీ చైర్మన్ ఆత్కూరి వీరవెంకట పవన్‌కుమార్, ట్రస్ట్ బోర్డు చైర్మన్ దాసరి మల్లికార్జునరావు, తాతా నాగేశ్వరరావు, జగదీష్, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దోమలతో ప్రాణాంతక వ్యాధులు

తాడేపల్లిగూడెం: దోమలతో ప్రాణాంతక వ్యాధులు వ్యాపిస్తాయని, వాటిని అరికట్టేందుకు ప్రజలు సహకరించాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి వైవీ లక్ష్మణరావు తెలిపారు. కడకట్ల పరిధిలోని 28, 31 వార్డుల్లో శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ఆరోగ్య కార్యదర్శులు, ఆశాలు, ఆరోగ్య సహాయకులు పాల్గొన్నారు.

పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకారం


నియమాక పత్రాన్ని అందుకుంటున్న కొలుకులూరి రామసీత

తాడేపల్లిగూడెం అర్బన్: వివిధ దేవస్థానాల్లో పాలక మండలి సభ్యులుగా నియమితులైన సభ్యులు నియామక పత్రాలను అందుకున్నారు. పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు కొలుకులూరి ధర్మరాజు సతీమణి రామసీత విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానం పాలక మండలి సభ్యులుగా నియమితులయ్యారు. శుక్రవారం విజయవాడ కార్యాలయంలో ఆమె నియామక పత్రాన్ని అందుకున్నారు. అనంతరం ప్రమాణ స్వీకారం చేశారు.

ఉద్యోగాలిస్తానంటూ మోసం చేసిన వ్యక్తిపై కేసు

తాడేపల్లిగూడెం అర్బన్: పట్టణంలోని యువకులకు ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మోసం చేసిన వ్యక్తిపై పట్టణ పోలీస్‌స్టేషనలో బాధితులు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెంటపాడు మండలం రాచర్ల గ్రామానికి చెందిన రాజశేఖర్ గతంలో కంప్యూటర్ ఇనిస్టిట్యూట్‌ను అట్టహాసంగా ప్రారంభించారు. తన ఇనిస్టిట్యూట్ ద్వారా కాంట్రాక్ట్ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ కొందరి యువకుల నుంచి రూ. 50వేల నుంచి రూ.లక్ష వరకు సొమ్ము వసూలు చేశాడు. దీంతోపాటు తన కంప్యూటర్ ఇనిస్టిట్యూట్‌లో భాగస్వామ్యం ఇస్తానంటూ మరికొందరి నుంచి భారీగా సొమ్ములు వసూలు చేశాడు. సంవత్సరాలు గడుస్తున్నా రాజశేఖర్ ఎటువంటి సమాధానం చెప్పకపోవడంతో, తమ సొమ్ములు తిరిగి ఇవ్వమని అడిగినా స్పందించకపోవడంతో బాధితులు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై సీఐ నాగరాజు మాట్లాడుతూ కేసు దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

కార్పొరేట్‌కు అనుకూలంగా కేంద్రం నిర్ణయాలు

తాడేపల్లిగూడెం: బ్యాంకులను మోసం చేసి దేశాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేసి, ఆర్థిక కుంభకోణానికి పాల్పడిన అదానీ, అంబానీ ఆస్తులు జప్తు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా ఉందని విమర్శించారు. నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చాక ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తానని మోసం చేశారన్నారు. బీజేపీకి ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు. నాయకులు అల్లం నరేంద్ర, తాడికొండ గంగాభవానీ, వడ్డాది మేరీ పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం

పెంటపాడు: ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి తీవ్ర అన్యాయం జరిగిందని పెంటపాడు మండల సీపీఐ కార్యదర్శి కళింగ లక్ష్మణరావు ఆరోపించారు. శుక్రవారం పెంటపాడు యూనియన్ బ్యాంక్ వద్ద బడ్జెట్‌లో ఏపీకి జరిగిన అన్యాయంపై తీవ్ర నిరసన తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ఆర్థిక నేరాలకు పాల్పడిన అదానీ ఆస్తులు తక్షణం జప్తు చేయాలని డిమాండ్ చేశారు. కొణతాల నాగరాజు, కొవ్వూరి వెంకటరెడ్డి, శేఖర్, ఎర్రా రామకృష్ణ, చింతాడి అశోక్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సహాయం


తణుకులో అగ్ని ప్రమాద బాధితులకు వంట పాత్రలు అందజేస్తున్న మానవత సభ్యులు

తణుకు టౌన్: అగ్ని ప్రమాదం కారణంగా సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు తణుకు మానవత సంస్థ ఆధ్వర్యంలో నగదు, వంట పాత్రలు పంపిణీ చేశారు. శుక్రవారం తణుకు పాతూరులోని శివాలయం వద్ద అగ్ని ప్రమాదం కారణంగా ఇళ్లు కోల్పోయిన ఏడు కుటుంబాలకు ఒక్కొక్కరికీ తణుకు మానవత సంస్థ రూ. 2 వేల విలువైన వంట పాత్రలను, నగదును అందజేసినట్లు ఆ సంస్థ అధ్యక్షుడు ఆలపాటి సుబ్బారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవత శాంతి ర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు, కన్వీనర్ ఎస్వీ సతీష్ బాబు, ఆనందం మస్తాన్‌రావు, ఏ బాలాజీ, కే సత్యనారాయణ, వీవీ రామకృష్ణ, పి కృష్ణంరాజు, రమణ మూర్తి పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే సీఎం జగనన్న ధ్యేయం

పెంటపాడు: రైతుల సంక్షేమమే జగనన్న ప్రత్యేక ధ్యేయమని మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కట్టుబోయిన కృష్ణప్రసాద్, ఎంపీపీ దాసరి హైమావతి పేర్కొన్నారు. వ్యవసాయ సలహా మండలి సమావేశం మండల కార్యాలయం వద్ద అధ్యక్షుడు కృష్ణప్రసాద్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆదేశాల మేరకు దాళ్వా పూర్తయ్యే వరకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా సభ్యులు నిత్యం రైతులతో సంప్రదించాలన్నారు. రైతులందరూ ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. గ్రామాల్లో గ్రూపులు ఏర్పాటు చేసుకొని వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లు సబ్సిడీపై పొందాలన్నారు. గూడెం ఏడీఏ పి. మురళీకృష్ణ, వ్యవసాయాధికారి కె. పార్థసారధి మాట్లాడుతూ ఇష్టానుసారంగా పురుగు మందులు వాడకుండా సేంద్రియ వ్యవసాయంపై రైతులు అవగాహన పెంచుకునేలా సభ్యులు కృషి చేయాలన్నారు. రైతులకు సభ్యులు అవగాహన కల్పించాలన్నారు. తహసీల్దార్ ఎం.శేషగిరిరావు, ఎంపీడీవో దామోదరరావు, సభ్యులు నల్లమిల్లి విజయానందరెడ్డి, కునుకు పుల్లయ్య, గుండుమోగుల మునీంద్ర, బుద్దన చంటి, తాడి భాస్కరరావు, నాగేశ్వరరావు తదితర వ్యవసాయ సలహా మండలి సభ్యులు పాల్గొన్నారు. పెంటపాడు మండల వ్యవసాయ సలహా మండలి నూతన అధ్యక్షుడు కట్టుబోయిన కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన తొలి సమావేశంలో నూతన అధ్యక్షుడు కృష్ణప్రసాద్‌తో పాటు, ఎంపీపీ హైమావతి పలు గ్రామాలకు చెందిన సలహా మండలి సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు.


పెంటపాడు మండల కార్యాలయం వద్ద మాట్లాడుతున్న సలహామండలి అధ్యక్షుడు కట్టుబోయిన కృష్ణప్రసాద్